# ఉత్సవమ్

8.12.18

శివ్వాని చంద్రశేఖర్ రెడ్డి

# ఉత్సవమ్

Utsavam

First e-Edition : 09-12-2018

e-mail : sivuni116@gmail.com
G+ : https://plus.google.com/collection/gNa8aB
Facebook : https://www.facebook.com/chandrasekhar.sivuni

Published by :
Sreeraaga publications,
Brahmin Street,
Atmakur,
SPSR Nellore Dt.
AP - 524322.

అహం ని సృజించి,
ఇహం కి బహూకరించిన,
శివుని శేషారెడ్డి,
మస్తానమ్మలని –
స్మృతిస్తూ,
కృతిస్తూ,
ఘటిస్తూ అంజలి .......

# ఉత్సవమ్

1. జననము
2. మరణము
3. కైవల్యము
4. నిర్వాణము
5. ఉత్సవము

మరణం అత్యంత క్లేశకరం, భయానకం, బీభత్సం.

మరణం ఒక ఉత్సవం.

రెండూ .. రెండు మానసిక పరిణతులు.

ఒకదాని నుంచి రెండోదానికి విప్పారిన తాత్వికచూపు .. "ఉత్సవమ్"

1. జననము
2. మరణము
3. కైవల్యము
4. నిర్వాణము
5. ఉత్సవము

## ప్రథమ వందనం......

పుడమిన ప్రభవించిన తొలిపూవుకి ప్రథమవందనం
తొలి ఫలమును ప్రసవించిన ఆది పుష్పమునకు ప్రప్రథమ వందనం.

కమలములకేమి తెలుసు కమలనాభుడు
పద్మములకేమి తెలుసు జొరాస్ట్రియన్
లిల్లీలకేమి తెలుసు దైవాల ఉద్భవం

పుడమిన ప్రభవించిన తొలిపూవుకి ప్రథమవందనం
తొలి ఫలమును ప్రసవించిన ఆది పుష్పమునకు ప్రప్రథమవందనం

మల్లెలకేమి తెలుసు రాతియుగములు
అడవిపూలకేమి తెల్సు కోతిమానవుడు
పూవులెరుగని చరితలా ఓ ఆక్సిజన్

పుడమిన ప్రభవించిన తొలిపూవుకి ప్రథమవందనం
తొలి ఫలమును ప్రసవించిన ఆది పుష్పమునకు ప్రప్రథమవందనం

# $N_2$ to $O_2$

శిలాజాల స్మృతిగీతం నత్రజని
మనుజుల కీర్తికేతనం ఆక్సిజని

పూవులు ఎరుగు జురాసిక్ యుగము
పూవుల లాలి మానవ శైశవం
శిశిరపు పాట జురాసిక్ పతనం
ఆమని గానం మానవ ప్రాభవం

శిలాజాల స్మృతిగీతం నత్రజని
భువన కీర్తనం ఆక్సిజని
.
ఆక్సిజన్ ప్రబలి జురాసిక్ వెళ్ళి
నత్రజని తగ్గి మనుజులు వచ్చె
యుగముల గానం శిలాజాల చరితం
పూవరుసలకి చేరే మానవ స్వరములు

శిలాజాల స్మృతిగీతం నత్రజని
మనుజుల కీర్తి కేతనం ఆక్సిజని

**కమలం..**

కమలం..చతుర్దశ దశ శత సహస్రదళ చరితం
కమలం కమలమ్.. ప్రపంచ ఆధ్యాత్మిక సౌరభం

ఈజిప్టు ఫెర్టిలిటీ దేవత Isis.. కమలం
చీకటి చేసిన వెలుగుల ప్రస్థానం..అరవిందము
మరణ, పునర్జన్మల సంకేతము..రాజీవము
ప్రాచీన జీవన సంస్కృతి కేదారము..ముకుందము
ప్రపంచ పురాణముల పూసిన.. సహస్ర పత్రము
అనాది నాగరిక సోపాన శిఖర దర్శనం..నీరజం
వనజమ్, అంబుజమ్.. ప్రపంచ సాంస్కృతిక సౌరభం
కుముదమ్, ముకుందమ్..చతుర్దశ దశ శత సహస్ర దళ చరితం

.

బుద్ధుని నిర్మల నిర్వాణ సోపానము..కమలం
ఆసియా తాత్విక జ్ఞాన లోచనం..శతపత్రము
కాశ్మీరలోయన పుట్టిన సౌందర్యలహరి..సరోజము
ఇరాన్, జపానుల తొలిప్రొద్దు.. సారంగము
6 BC న తూర్పు పశ్చిమ వర్తకదారిన సాగి,
ఈజిప్టు చేరిన జంబూద్వీప చింతనం..బిసరూహము
పద్మమ్, పంకజమ్..ప్రపంచ తాత్విక సౌరభం
కమలం కమలమ్.. చతుర్దశ దశ శత సహస్ర దళ చరితం

## ఈ ఎర్రగులాబి..

రారాణి పూరాణి ఈ ఎర్రగులాబి
మాయ, హరప్ప.. ఓ మెసపొటేనియా

నీ పూరెక్కల శిలాజము చతుర్ధ దశ శత సహస్రము
గ్రీకు పురాణముల పుష్పించిన చెంగల్వము
రారాణి పూరాణి ఈ ఎర్రగులాబి ;
నైలు, టైగ్రస్.. ఓ సరస్వతీ
రారాణి పూరాణి ఈ ఎర్రగులాబి

.

నీరోల సమాధుల పూమాల నీవు
రారాణి మధువుల పూరేకు నీవు
బౌద్ధ, క్రీస్తు పవిత్రరాతలలో, వర్ణ చిత్రాలలో
రారాణి పూరాణి ఈ ఎర్రగులాబి ;
మాయ, హరప్ప... ఓ మెసపొటేనియా
రారాణి పూరాణి ఈ ఎర్రగులాబి

## పూల విన్నపాలు ..

వాసన చూసీ పో రా ద
నిలబడి క్షణమూ, నిలకడ మనసుతో
ధ్యానమె చేసీ పోరాద,
నీ పురాపురాపురా పురాతనమై..

.
ఏమి వాసనది మెసపొటేనియా
ఏమి వాసనిది మొహంజదారో
మా పురాపురా పురాపరిమళం –
కాదది మల్లెల వాసన, మగువల వాసన...

ధ్యానము చేసీ పోరాద
నిలబడి క్షణమూ, నిలకడ మనసుతో
పూ వాసన చూసీ పో రా ద,
నీ పురాపురాపురా పురాతనమై..

.
ఇంత వాసనిదా జానపదమాల
ఎంత వాసనదీ శిలాజయుగమూ
మా పురాపురా పురాపరిమళం
కాదది పురాణ వాసన, కావ్యపు వాసన...

వాసన చూసీ పో రా ద
నిలబడి క్షణమూ, నిలకడ మనసుతో
ధ్యానమె చేసీ పోరాద,
నీ పురాపురాపురా పురాతనమై..

1. జననము

2. మరణము

3. కైవల్యము

4. నిర్వాణము

5. ఉత్సవము

పూదోట ..

పూదోట ముకిళించెరా
వర్ణాల, గంధాల గళమెత్తి స్వరమెత్తి
పూదోట రవళించెరా

మందారపుష్పాలు స గ మ ద ని స
మందారపుష్పాలు హిందోళరాగాల
పూజకు ముకిళించె రా
చేమంతి పూబంతి సన్నాయిరాగాన
పూదోట మురళించె రా

ధనుర్మాస రేయంత ఆ పారిజాతాలు
ధనుర్మాస రేయంత సమ్ మోహనరాగాల
పూదోట ముకిళించె రా
జాజుల్లు, మల్లెల్లు ఆ కృష్ణ గానాన
పూదోట రవళించె రా

అజంతభాష ..

నన్నొక అక్షరముగ తొడగ, సుస్వరములై పూచితి
నీ కృతులే కూర్చితి, పాడితి, రాలితి... నీ తోటల
అజంత అజంతా
అజంతా ఒఓఓ... అజంతా

మల్లియనె చూడు క్షేత్రయ వాడు
పారిజాతమె చూడు తిమ్మనవాడు
వైజయంతీమాలలే అన్నమయ త్యాగయ పాల్కురిలు
అజంతా అజంతా
అజంతా ఒఓఓ... అజంతా

ఆముక్తమె చూడు రాయలువాడు
గరికపూవె చూడు పోతనవాడు
సౌందర్యలహరులే జానపదుల్, వేమన, జానుతెనుగు చోడుడు
అజంతా అజంతా
అజంతా ఒఓఓ... అజంతా

## పూదోట కలగంది ...

పూదోట కలగంది పూవా పూవా
కలవని కలయికలే ఋతువా

శరత్తు లేమెరుగు మల్లియ ఘుమఘుమలు
మరుమల్లె ఏమెరుగు వెన్నెల దప్పికలు
మల్లియపైనా శరత్తు సోనలనె..పూవా పూవా
పూదోట కలగంది కలవని కలయికలనే ఋతువా

ఆషాడమేఘాలకేం తెలుసు చేమంతి సొబగులు
కార్తీకమాసాల కేం తెలుసు తొలకరి చినుకులు
మరణములోనా పసిప్రాయములనె..పూవా పూవా
పూదోట కలగంది కలవని కలయికలనే ఋతువా

## శిశిర విరులు (falling leaves)

ఆకులన్ని పూవులై పూయునే నీ మహిమతో
శిశిరమా.. హరితమంత రంగులై నవ్వునే నీ రాకతో

.
ఆకుఆకునా రాయవే డావెన్సి చిత్రము
ధూళిధూళికీ చేరవేయ నీ రహస్యకానుక

ఆకులన్నీ పూవులై పూయునే నీ మహిమతో
శిశిరమా.. హరితమంత రంగులై నవ్వునే నీ రాకతో

.
రంగురంగుకీ పరిమళం అడగదే మట్టి వాసన
ఆకుఆకున మధువునే చూడదే తల్లి భావన(భూదేవి)

ఆకులన్ని పూవులై పూయునే నీ మహిమతో
శిశిరమా.. హరితమంత రంగులై నవ్వునే నీ రాకతో

Note: శిశిర ఋతువు.. ఆకులు రాలే కాలం.
పండుబారి రాలేకాలం.
ప్రతి ఆకూ వర్ణశోభితమే.
ప్రతి పత్రం రంగులచిత్రమే
ప్రతిదీ తావి, తేనే లేని పుష్పమే.
ప్రతిదాని సాయుజ్యమూ ధూళినె

తుంచకె...

తుంచకె నీవూ ఎంచిమరీ
ఏ కలనున్నదో ఆ కలికి మరీ
కోయకె నీవూ వేగిరపడీ...

భ్రమరము వాలి సంపర్కము సాగి
పూవే తల్లిగ మారే ఘడియన...
తుంచకె నీవూ ఎంచిమరీ
ఏ కలనున్నదో ఆ కలికి చెలీ....

ద్రాక్షతీగను కని మల్లెతీవె
మల్లెపిందెలను కలలుకనే వేళ
తుంచకె నీవూ ఎంచిమరీ
ఏ కలనున్నదో ఆ కలికి చెలీ...

**నెలా ...** ( O moon..)

పూదోట అలిగినది నెలా
నింగంత వసంతమా నెలనెలా
పూదోట అలిగినది నెలా – ఎలా .. నెలనెలా

కార్తీకమాసాలు నింగంత కైలాసమా
ధనుర్మాస రేయంత మిన్నంత వైకుంఠమా

పూదోట అలిగినది నెలా
నింగంత వసంతమా నెలనెలా
పూదోట అలిగినది నెలా – ఎలా .. ఎలఎలా...

.

వైశాఖమాసాన నిశంత శిశర మె
ఈ చైత్రమాసాన ధరణంత వసంత మె

పూదోట అలిగినదె నెలా
నేలన్న దిగవే ఎలా
పూదోట అలిగినది నెలా – ఎలా .. నెల నెలా..

## తొలి ప్రేమలు..

తొలిప్రేమలకేమి తెలుసు పూవులు
తామె.. ఎదలో వాడనీ పూదోటలు – ఈ
తొలిప్రేమలకేమి తెలుసు...

.
రాతిపూవుల కేమి తెలుసు మధువులు..
హొయసల రాతిపూవుల కేమి తెలుసు,
డ్రై ఫ్లవర్స్ కేమి తెలుసు తుమ్మెద..
చీనా రంగుపూవుల కేమి తెలుసు

తొలిప్రేమలకేమి తెలుసు పూవులు
అవి.. ఎదలో వాడనీ పూకొమ్మలు – నా
తొలి ప్రేమలకేమి తెలుసు...

.
వర్ణచిత్రములకేమి తెలుసు పరిమళం..
కాగితపు పూవులకేమి తెలుసు,
బంగరు పూవుల కేమి తెలుసు భ్రమరం..
పంచలోహ పూవులకేమి తెలుసు

తొలిప్రేమలకేమి తెలుసు పూవులు
తామె.. ఎదలో వాడనీ పూదోటలు – నా
తొలిప్రేమలకేమి తెలుసు.....

## పూదోట వాకిట...

పూదోట వాకిట అలా...
చంద్రమా చంద్రమా బిక్షమెత్తకే అలా..
నా పూదోట వాకిట,
చైత్రమా చైత్రమా బిక్షువవ్వకే ఇలా..
నా పూదోట వాకిట

.
మెరుపులు మెరుపూలూ బిక్షమెత్తకే పరిమళం పరిమళం బని
మబ్బులు మబ్బులూ బిక్షువవ్వకే రంగులు రంగులూ యని
నా పూదోట వాకిట..
వేసవి వేసవీ బిక్షమెత్తకే అలా..
రోహిణి రోహిణీ బిక్షువవ్వకే ఇలా..
నా పూదోట వాకిట..

.
పవనమ పవనమా బిక్షమెత్తకే లలితం లలితం బని
సంద్రమ సంద్రమా బిక్షువవ్వకే మధువులు మధువులూ యని
నా పూదోట వాకిట
హేమము హేమమా బిక్షమెత్తకే అలా..
శిశిరమ శిశిరమా బిక్షువవ్వకే ఇలా..
నా పూదోట వాకిట..

## పూతోటలు కామా...

తోటలు కామా మేమని అడిగె
పూదోటలు కామా మేమని అడిగె

పచ్చని పువ్వులు మా కందిచేనులూ
లేపచ్చని పూకంకులు శ్రీవరీ పొలములూ
రంగులు కావా మావని అడిగె
తేనియ లేదా మాకని అడిగె
తెల్లనీ పూవులు మా జల్లేడు గుట్టల్లూ
ముత్యపూచాయ మా కానుగ పూవుల్లూ

తోటలు కామా మేమని అడిగె
పూదోటలు కామా మేమని అడిగె

.

తియ్యనీ పూతలు మా మామిడీ తోపుల్లూ
ఘుమఘుమల పువ్వులు మా నిమ్మ తోటల్లూ
వాసన లేమా మేమని అడిగె
అందము లేదా మాకని అడిగె
పసుపూ ముద్దలూ మా తుమ్మపువ్వుల్లూ
సన్నాయిా దేహాలు మా ఉమ్మెత్త పువ్వుల్లూ

తోటలు కామా మేమని అడిగె
పూదోటలు కామా మేమని అడిగె

ఋతువుల వీడ్కోలు ...

కాలము చేసెను బాసను నాకు
వెళ్ళకు ప్రియతమ వచ్చెద రేపు

.
గ్రీష్మము ముగిసేపోయినదీ నేలల
తొలకరి వేచినదీ నల్లని మబ్బుల

వెళ్ళకు సుమ్మీ వచ్చెద తదుపరి
కాలము చేసెను ఒక బాసను నాకు

.
బంతులు పూయవు హేమము వెడలెను
శిశిరము వచ్చినదీ హరితము రాల్చను

వెళ్ళకు సుమ్మీ వచ్చెద రేపు
కాలమిచ్చెను ఒక మాటను నాకు

# Veg / Non Veg gardens...

మా మెడలన్ విరిచి కుత్తుకులన్ త్రుంచి
కడుపులన్ చీల్చి ఆస్వాదిత్తురే..
సున్నితులమని.. సన్నిహితులమని.. దయాపూరితులమనీ
మా మెడలన్ విరిచి కుత్తుకులన్ త్రుంచి
కడుపులన్ చీల్చి ఆస్వాదిత్తురే...
.
పూజలవేళ .. పండుగవేళ
భోగములకు.. జాతరలకు
జయంతని.. పెళ్ళని..దినమనీ

మా మెడలన్ విరిచి కుత్తుకులన్ త్రుంచి
కడుపులన్ చీల్చి ఆస్వాదిత్తురే.. పూబాలలన్
సున్నితులమని.. సన్నిహితులమని.. దయాపూరితులమనీ...
.
పూజలవేళ.. పండుగవేళ
భోగములకు.. జాతరలకు
జయంతని.. పెళ్ళని.. దినమనీ

మా మెడలన్ విరిచి కుత్తుకులన్ త్రుంచి
కడుపులన్ చీల్చి ఆస్వాదిత్తురే..
కుక్కుటమని.. గొఱ్ఱెలని.. పశువులనీ..మూగజీవులన్
సున్నితులమని..సన్నిహితులమని..దయాపూరితులమనీ..

అరరె ..

ఉదయమె కాదా నే విరిసినది
ఈ ఉదయమె కాదా.. అరరే

రెక్కలు విప్పితి రంగులు తొడిగితి
మధువులు ఊర మధుపాత్రయి మిగుల
పొద్దేవాలినది అరెరె సంధ్యేపిలిచినది అరరె
ఈ ఉదయమె కాదా నే విరిసినది.. అరరె అరరే
రేపటి ఉదయము రాదా నాకిక...

చినుకునె ఎరుగక మంచూ తెలియక
వెన్నెల్లో మునగక రాత్రిని చూడక
పొద్దేవాలినది అరెరె సంధ్యేనిలిచినది అరరె
ఈ ఉదయమె కాదా నే విరిసినది.. అరరె అరరే
రేపటి ఉదయము లేదా నాకిక.....

శరదృతువు ...

రాలిన క్షణముల రాబోవు క్షణముల పరిమళమే నీవు
రాల్చిన పూవుల, పూబోయె పూవుల స్వప్నములే పూదోటలు

.
గ్రీష్మము దాటును చంద్రమా వీడదు మల్లెల వాసన
హేమము చేరదు చంద్రమా వాలును పారిజాతపరిమళం

రాలిన క్షణముల, రాబోవు క్షణముల పరిమళమే నీవు
రాల్చిన పూవుల, పూబోయె పూవుల స్వప్నములే పూదోటలు

.
రాలిన క్షణములు చంద్రమా వెలుగును జ్ఞాపకమై
రాబోవు క్షణములు చంద్రమా రేపును మాధుర్యము

రాలిన క్షణముల, రాబోవు క్షణముల పరిమళమే నీవు
రాల్చిన పూవుల, పూబోవు పూవుల స్వప్నములే పూదోటలు

1. జననము

2. మరణము

3. కైవల్యము

4. నిర్వాణము

5. ఉత్సవము

## ఈశ్వరా ..

పూవే పూయకపోతే
చిన్నినవ్వే నవ్వకపోతే
ఎక్కడ నీవూ ఈశ్వరా.. ఇట
ఎక్కడ నాకు నీ దర్శనం

కోవెలలోన మూర్తులలోన
పూజలలోన ఉత్సవంలోన
ఎక్కడ నీవూ ఈశ్వరా.. ఇట
ఎక్కడ నాకూ ఈశ్వరా

రంగులలోన మధువులలోన
ఋతువులు సాగే పూతోవ(ట)లలోన
ఎక్కడ నీవూ ఈశ్వరా .. ఇక
ఎక్కడ నాకూ నీ దర్శనం

## పూపూపూనది ..

పూతోట యిది... పూనది
హరిసేవకు, సిరిసేవకు, శివపూజకు సాగే పూనది
క్షీరసాగరశయనుని సంగమించే పూపూపూపూనది

నీలగిరుల నీలాంబరి
అరకులోయల పసుపాంబరి
వేసంగుల కనకాంబర, శ్వేతాంబర
భద్రాద్రికి, సింహాద్రికి, శేషాద్రికి సాగే పూనది,
హరిసేవకు, సిరిసేవకు, శివపూజకు సాగే పూపూపూనది

గోదారి తరగల్లు బొండుమల్లియలు
కృష్ణా కెరటాలు నల్ల కలువల్లు
గిరి తనయలు పెన్నా కావేరీలు
మీనాక్షికి, కామాక్షికి, విశాలాక్షికి సాగే పూనది,
హరిసేవకు, సిరిసేవకు, శివపూజకు సాగే పూపూపూనది

బంతీ ..

శివరాతిరి యిది శివశివ యని రాలవే - బంతీ
ముక్కోటి ఏకాశి హరి హరీ యని వెళ్ళవె

.

పూసింది చాల్లే పున్నాగపువ్వా కైలాశమేమీ రాదె
కాసింది చాలూ శ్రావణచంద్రా వైకుంతముంది మూసే

శివరాతిరి యిది శివశివ యని రాలవే - బంతీ
ముక్కోటి ఏకాశి హరి హరీ యని వెళ్ళవె

.

హరి నిదురను వీడ వైకుంఠ దక్షిణ ద్వారము తెరిచె
వైకుంఠమె నీకూ సరాసరి పారిజాతమా రాల వే

శివరాతిరి యిది శివశివ యని రాలవే - బంతీ
ముక్కోటి ఏకాశి హరిహరీ యని వెళ్ళవె

దొంగ ..

సీతమ్మ మనసు పడ్డాదె నిన్ను
కృష్ణయ్య వెంట పోయావే...

.
అది మిథిలానగరము జానకీ పరిణయము
సీతమ్మ హృదయము పారిజాత వరమాలిక
తన రాముని కోసము ఆ సీతమ్మ హృదయము

సీతమ్మ మనసు పడ్డాదె నిన్ను
కృష్ణయ్య వెంట పోయావే...

.
అది దండకారణ్యము సీతా వనవాసము
జానకి కోరెను, సిరికి సరి విల్లు సేయ
వెదురును వెతికెను ఆ రామయ్య హృదయము

రామయ్య మనసు పడ్డాడె నిన్ను
కృష్ణయ్య వేణువయ్యావే...

కృష్ణం ..

నల్లని వాడివో కృష్ణా – చెల్లని వాడివో
తెల్లనీ నవ్వుల యశోద చల్లని వాడవో

.
నల్లని వాడివా కృష్ణ
యశోద కన్నుల నల్లని వాడివా,
తెల్లని వాడివా కృష్ణ
గోపీదళమున తుమ్మెదా.. తెల్లని వాడివా

నల్లని వాడివో కృష్ణా – చెల్లని వాడివో
మెల్లనీ నవ్వుల యశోద చల్లని వాడవో

.
చెల్లని వాడివేపో సత్య –
చెంగళ్వ కన్నుల్లో చెల్లని వాడివో,
చెల్లని వాడివా కృష్ణ –
రాధమ్మ కన్నుల్లో చెల్లిని వాడివెపో

నల్లని వాడివో కృష్ణా – చెల్లని వాడివో
మెత్తనీ నవ్వుల రాధమ్మ 'చల్ల'ని వాడవో

## ఎవరహో ..

ఎవరహో.. ఎవరహో
నలుపు తెలుపుల పూదోటకి రంగులకలలే ఇచ్చినదెవరు
ఎవరహో... ఎవరహో...

తూరుపుగాలికి తనువును తుమ్మెదరెక్కలు చేసినదెవరు
తొలకరి చినుకుల చిత్తడిమాలకి దేహము నొంచినదెవరు
ఎవరహో.. ఎవరహో..., ఎవరహో.. ఎవరహో..
నలుపు తెలుపుల పూదోటకి రంగులకలలై వచ్చినదెవరు

నలుపూ తెలుపూ పూలకు రంగులు తొడిగినదెవరు
ఉప్పని చప్పని పూరేకుల మధువులు వొంపినదెవరు
ఎవరహో... ఎవరహో... ఎవరహో... ఎవరహో...
నలుపు తెలుపుల పూదోటకి రంగులకలలై వచ్చినదెవరు

## ఎప్పుడు వచ్చెదవో ..

ఎందుకు ఇచ్చితివో తెలియదు
ఎప్పుడు వచ్చెదవో... ప్రభూ

.
ఏ గాలి కోరినదనీ ఈ పరిమళమూ
ఏ తుమ్మెద అడిగినదనీ ఈ మధువులూ
ఏ పూలు కోరి ప్రభూ ఈ వేవేల రంగులూ

ఎందుకు ఇచ్చితివో తెలియదు
ఎప్పుడు వచ్చెదవో... ప్రభూ

.
ఏ వెన్నెల అడిగినదనీ ఈ మృదులమూ
ఏ హేమము కోరినదనీ ఈ ఆర్ద్రమూ
ఏ పూలు కోర ప్రభూ ఈ వేవేల సోయగములు

మోయలేక ఓపలేక ఉగ్గపట్టుంటి
ఎప్పుడు వచ్చెదవో...

ఇక ...

ఏ పూవును నీకై తెంచను స్వామి
ప్రతి పూవున నీది నగుమోము నే కనీ

.
కమలనాభుడవు నీవనీ.. నే రాజీవములను తేబోవ
పద్మనయనమ్ములవాడు తన కన్నులు చూపె..

ఏ పూలను నీకు కానుక చేయను స్వామి
మాలినని నేనన..నిరుపేదవని నీవంటే..

ఏ పూవును నీకై తుంచను స్వామి
ప్రతి పూవున నీది నగుమోమును చూప

.
నీరజాక్షివి నీవని.. నే నీరజములు కోబోవ
సరోజదళనేత్రములవాడు కన్నులెర్ర చేసె

ఏ పూలను నీకు కానుక చేయను స్వామి
మాలినని నేనన... నిరుపేదవని నీవంటే..

ఏ పూవును నీకై తుంచను స్వామి
ప్రతి పూవున నీది నగుమోమును చూప

కాన్క ....

నే నెరుగను స్వామి..
ఈ వేళ.. నీ రాక.. నిక్కముగ

.
పూలే రాలిన పూతోటల కొచ్చిన
ఏ పూలను అల్లినే, నిలువను వాకిట

నే నెరుగను స్వామి..
ఈ వేళ.. నీ రాక.. నిక్కముగ

.
పూదోటను కానూ, శిశిరాంతము రానూ
యే శిశిరము తాకని ఎద నే చేసెద కాన్క

నే నెరుగను స్వామి..
ఈ వేళ.. నీ రాక.. నిక్కముగ

## అతిధీ ...

క్షమించు ప్రభూ... నీ వొచ్చే వేళకి
నా యింటి వాకిలి గడియపెట్టితి శాశ్వతముగ

నే రాలిపోయాక..
వెన్నెల విరిసింది.. చిరుగాలీ తోడైంది
ఆతిథ్యానికి తుహిన సోనన భ్రమరమై నీ...
క్షమించు ప్రభూ... నీ వొచ్చిన వేళకి
నా యింటి వాకిలి గడియ పడినది శాశ్వతముగ

అతిధీ...
నీకై ఎత్తిన మధువులు  తేనెపట్టున దాచున్నాయి
నీకై తొడిగిన పరిమళాలు పూతోటల దాగున్నాయి
ప్రభూ.. లేతేనెటీగవై ఆతిథ్యం స్వీకరించు
నే రాలిపోయిననూ..
నీ వొచ్చే వేళకి, ఏ పొరపాటు దొరలక
నా యింటి వాకిట ఎదురుచూచెద తదుపరీ...

ప్రార్థన ..

రాలిన పూవుల కలలే ఏరి
కైంకర్యము చేసితి ఆ నింగికి నేను

చల్లని చినుకున తడిచి పో వాలని
మెరుపే చూడక, ఉరుమే వినక .. రాలిన
రాలిన పూవుల కలలే ఏరి
కైంకర్యము చేసితి ఆ కరిమబ్బుకి నేను

నల్లని మబ్బులు చూచి రాలాలని
కానక వరదగుడి, చూడక సింగిడి
రాలిన పూవుల కలలే ఏరి
కైంకర్యము చేసితి ఆ నింగికి నేను

మృతమాలలు ..

నీ వెళ్ళే దారులలో నాటెద మల్లెతీవెలనూ
ప్రభూ నీ వచ్చే తోవను చేసెద సరోజ సరోవరములనూ

.

పంపను నీకు e-పువ్వులు మీడియాలలో
వేయను నీకు విద్యుత్ మాలలు ఉత్సవాలలో

ప్రభు నీ వెళ్ళే దారులలో నాటెద జాజితేవెలనూ
ప్రభు నిను చేర్చే తోవలలో పెంచెద గులాబీ తోటలను

చేయించను నీకూ నవరత్నమాలలు, కరెన్సీ మాలలనూ

.

కైంకర్యము చేయను కోసినపూవుల మృతమాలలనూ
సేయను నీకు ఏరినపూవుల పూసేవలనూ

ప్రభు నీ వెళ్ళే దారులలో నాటెద పొన్నమొక్కలనూ
ప్రభు నీకై వచ్చే తోవలలో పెంచెద తులసితోటలను

మొక్కను నీకు ముత్యాలహారములు, కాసులపేరులనూ

## సర్వాంతర్యామీ ..

ఎంగిలి పడితిని నే స్వామి
సర్వాంతర్యామీ నీ వని

తుమ్మెద ముద్దుల ముంచినది
చిరుగాలే నను కూడినది
ఎంగిలి పడితిని నే స్వామి
నీవని సర్వాంతర్యామి

వెన్నెలతోన జలకము లాడుతూ
తుహినము సేయు పవళింపు సేవల
ఎంగిలి పడితిని నే స్వామి
నీవని సర్వాంతర్యామీ

శిశిరపుతోట ...

మల్లెలు నాస్తి, జాజులు నాస్తి
పీపాదశ యిదీ – త్రిపురాంతక

రంగులు లేని మంచుపుష్పములూ... నీకై
అభిషేకప్రియుడవని శిశిరము తొడిగె – త్రిపురాంతక

మల్లెలు నాస్తి, జాజులు నాస్తి
పీపాదశ యిదీ – త్రిపురాంతక

.
జీవుడు వదలును దేహమునూ ... నీకై
పూతోటలు వదలు శిశిరమునూ – త్రిపురాంతక

మల్లెలు నాస్తి, జాజులు నాస్తి
పీపాదశ యిదీ – త్రిపురాంతక

ఆనతి..

ఆనతి రాదే
నీ ఆనతి రాదే...

రంగులు బరువయె, మధువులు బరువయె
వాసన బరువయీా, నాకు... నేనే బరువయి నిలువ
ఆనతి రాదే
నీ ఆన తీ రాదే...

అందము బరువయె, ఆనందము బరువయె
మృదులము బరువయీా, నాకు.. నేనే బరువయి నిలువ
ఆనతి రాదే
ఏ ఆన తీ రాదే...

సంకెల ..

ఏమి జన్మము - ప్రభు
ఇదేమి సంకెలా..

పూసితి
ఎండితి
వాసన పోదె,
విమలము కానే
ఏమి జన్మము - ప్రభూ...

వడలితి
తడిసితి
రంగులు పోవె,
వివర్ణము కానే
ఏమి జన్మము - ప్రభూ....

పూబాల మొఱ ...

కంఠము త్రుంచితిరే – స్వామి
నీకై నే పూయక మునుపే సేవకి... నా
కంఠము త్రుంచితిరే...

.
ఊపిరి విడువక పూచితినీ
ప్రాణముతోనే నే సేవించితిని

నీకై నే పూయక మునుపే సేవకి
స్వామి.. నా కంఠము త్రుంచితిరే.. నీ పేరున

.
రంగులు మాయక తెచ్చితినీ
వాసన విడువక చేర్చితిని
నీకై నే పూయక మునుపే సేవకి
స్వామి.. నా కంఠము త్రుంచితిరే... నీ పేరున

## శిశిరమా ...

ఎన్ని గంధములె పుష్పమా నీకు ఎన్ని వర్ణములె
ఎన్ని దాహములె దేహమా నీకు ఎన్ని మోహములె
దేహమా.. దేహమా.. పుష్పమా..

.
పూవే రాలును... రంగుల తోటి,
వూవే రాలును... గంధము తోటి
పూవే రాలును ...తేనియ తోటి

మృతమే మిగులు -
రంగులతోటి, మధువులతోటి, గంధము తోటి
పుష్పమా. పూష్పమా..పుష్పమా...

.
దేహము మిగులు .. రంగులు పోయి
దేహము మిగులు .. గంధము పోయి
దేహము మిగులు .. ముధువులు పోయి

ఊపిరె వదలదె -
రంగులు పోయిన, మధువులు పోయిన, గంధము పోయిన
శిశిరమా. శిశిరమా.. శిశిరమా...

నవ్వు ...

పిచ్చిదానినని – నవ్వు
పిచ్చివాళ్ళని

నాలో నేనే మాట్లాడు కొందు .. ప్రభూ
నాలో నీతో మాట్లాడు కొందు
పిచ్చి దానినని ...
పిచ్చివాళ్ళని

నాలో నేనే నవ్వుకొందు .. ప్రభూ
నాలో నీతో నవ్వుకొందు
పిచ్చిదానినని ...
పిచ్చివాళ్ళని

## నవ్వకురా ...

తూరుపు వెలుతురు పూవాయె... ప్రభూ
నవ్వకురా.. తొలి సేవకు నీవాయనీ

.
పారిజాతము లేదు తిమ్మన దోచె
పొన్నలు లేవు అన్నయమ దాచె
తూరుపు వెలుతురు పూవాయె.. ప్రభూ

వైజయంతులు లేవు యదునందని చేరె
కమలము నివ్వడు పద్మనాభుడు వాడు
నవ్వకురా.. తొలి సేవకు గడ్డిపూవాయని

.
తులసిమాలలు లేవు అన్యులకవ్వదు లక్ష్మి
కలువలూ లేవు వెన్నెల లేదని
తూరుపు వెలుతు పూవాయె .. ప్రభూ

చేమంతులు లేవు అదునిది కాదని
మొగలీపూవులు శాపమునున్నవీ
నవ్వకురా.. తొలిసేవకు గడ్డిపూవాయని

కృతజ్ఞతలు ...

ఏది సౌఖ్యమని ఏది దు:ఖమనీ
ఎవరికి తెలుపను ప్రభూ కృతజ్ఞతలూ

.
ఏమి అందమని నౌక అతివ నను జడలో బందించినదీ
అబ్బ ఏమి వర్ణమని నౌకపూజకు నను సంకెల కుట్టితివో

ఏది కంటకము ఏది వైకుంఠము
ఎవరికి తెలుపను ప్రభూ కృతజ్ఞతలూ

.
ఏమి ఘుమఘుమలని నౌక తుమ్మెద నా హృది పొడిచీ తాగినదీ
అబ్బబ్బ ఏమి సుతారమని నను తుఫాను అదాటున కూల్చినదీ

ఏది మధురమని ఏది ఘోరమని
ఎవరకి తెలుపను ప్రభూ కృతజ్ఞతలూ

## నా తల్లికి స్వామి ...

రాలిన పూవులు, రాలిన క్షణములు
ఎవరికి కానుక.. చేయను స్వామి

మధువులు లేవని మధుపము చేరదు
పార్థివదేహమని పవనము అంటదు
రాలిన పూవా చెప్పవె నీవూ
పూచే పూలకి తెలుపవే నిను

దేవత లొద్దనే అతివలు వద్దనె
శోభకి వద్దనె అలంకరణ కేలనె..
రాలిన పూవులు, రాలిన క్షణములు
ఎవరికి కానుక.. చేయను స్వామి

రాలిన పూలు వెళ్ళగ రౌద్రభూమికి
బిల్వప్రియుడు నివ్వరపడి పడె
రాలిన పూవా చెప్పవె నీవూ
పూచే పూలకి తెలుపవే నిను

రుద్రుడు వద్దన పుడమే వద్దనునా
తల్లికి బిడ్డలు తేలిక అవునా
రాలిన పూవులు, రాలిన క్షణములు
చేసెద కానుక తల్లికి స్వామి
చేసెద కానుక నా తల్లికి స్వామి

1. జననము
2. మరణము
3. కైవల్యము
4. నిర్వాణము
5. ఉత్సవము

పూవొక ...

కాలమొక భిక్షువు
జీవమొక భిక్ష
నింగీ నేలా నిప్పు నీరూ గాలి భిక్షువులూ – బంతే

.
పూవొక భిక్షువు
మేఘమొక భిక్షువు
పూయటమే భిక్ష
కురియటమే భిక్ష... బంతే
జీవుడొక భిక్షువు
దేహమొక భిక్ష
నింగీ నేలా నిప్పు నీరూ గాలి భిక్షువులూ – బంతే

.
సూర్యుడొక భిక్షువు
చంద్రుడొక భిక్షువు
గ్రీష్మమే భిక్ష
శరత్తులే భిక్ష.... బంతే

భిక్షం కోరని భిక్షువులు
భిక్షని వొసగే భిక్షువులు
నదీ నదమూ సరసూ సంద్రము భిక్షువులూ – బంతే

పూవిడిది ...

లోకమొక మల్లెపూవు
ఆఘ్రాణించు, ఆస్వాదించి
తదుపరి కొదిలెయ్ మల్లియను...

అతిథివి నీవు
ఆతిథ్యం పూవు
విడిదే చేసి, సాగిపో...

.
ప్రపంచమొక గులాబి చూడు
అందము గ్రోలు, మధువుని త్రాగి
రేపటి కొదులూ రోజాని

అతిథివి నీవు
ఆతిథ్యం పూవు
విడిదే చేసి, సాగిపో... పో పో

పరివ్రాజకులు ...

పూవే పూసెను
విడిదిగ పరివ్రాజకులకు

రాతిరి నొక పరివ్రాజకుడు
పగటికొక పరివ్రాజకుడు
పూవే పూసెను
విడిదిగ సూర్యచంద్రులకు..

పవన మొక పరివ్రాజకుడు
భ్రమర మొక పరివ్రాజకుడు
పూవే పూసెను
విడిదిగ తావి, తేనెలకు..

## స్వేచ్ఛను చూడూ ...

స్వేచ్ఛను చూడూ - బంతే
గాలిలో ఆడే భిక్షువే పూవు

వాసన లొదిలెయ్ గాలికి
మధువులు ఇచ్చెయ్ ఆర్తులకు.. ఇక
స్వేచ్ఛను చూడూ - బంతే
చిరుగాలితో ఆడే భిక్షువే పూవు

కోర్కెలు నిండెన వదలను
భయములు లేవా బ్రతకను... ఇక
స్వేచ్ఛను చూడు - బంతే
వెలుగునీడ లంటని శిశువే భిక్షువు

దాహి ...

పూదేహము పాత్రగ విరియ
ఉదయము భిక్షకు నిలిచితిని నీ మ్రోలన నింగీ

.
కాంతులు పోసితివీ
కృష్ణబిలమై త్రాగితిని

నా పూదేహపు పాత్ర
భిక్షకు పట్టితిని నీ మ్రోలన

.
దాహము తీరక నేను
సాయం సంజయి నీవూ

రేపన నీవు... లేదని నాకు
భిక్షకు నిలిచితినీ మరిమరీ

## భిక్ష ...

భిక్షువూ
భిక్షగ ఏమి చెందినది
భిక్షగ ఏమి అందిస్తివి
భిక్షువు భిక్షువు భిక్షువూ...

.
పరిమళ మెవరికి భిక్షను చేసితివి
మధువుల నెవరికి భిక్షను చేసితివి

భిక్షువూ
'నా' లు భిక్షగ వదిలితివా
భిక్షువు భిక్షువు భిక్షువూ...

.
ఫలముల నెవరికి భిక్షను చేసితివి
మరణము నెవరికి భిక్షను చేసితివి

భిక్షువూ
స్వేచ్ఛను భిక్షగ పొందితివా
భిక్షువు భిక్షువు భిక్షువూ...

భిక్షపాత్ర (పూదేహం) ...

పొద్దు వాలినా ... భిక్షలో
పూపాత్ర నిండదే ప్రభూ

.

అనంత కాంతి వేసినా భిక్షగా సూర్యుడు
దిగంత పవన మేసినా భిక్షగా ప్రకృతి

పొద్దు వాలినా.. భిక్షువూ
పూపాత్ర నిండదే ప్రభూ

.

ఎర్రగాలి వేయగ, భిక్షగా రేణువు
పాదరేణు వేయగ, భిక్షగా తుమ్మెద

పూపాత్ర నిండి, భిక్షువూ
నేల రాలె భిక్షపాత్ర ప్రభూ

బోధత్వం ...

మృత్యువు తెలియనిదా పువ్వులకు మరణము తెలియనిదా
దు:ఖము తెలియదులే పూవులకు దు:ఖము తెలియదులే

.

రాలే పూలకు వీడ్కోలు తొడిగే మొగ్గకు ఆహ్వానం
నడుమ జీవనేచ్ఛల ఉత్సవములు
దు:ఖము నెరుగవులే పూదోటలు ఆశలనూ ఎరుగవులే

.

దు:ఖము తెలియునా పూవులకు కారణమూ తెలియునా
కోర్కెలు తెలియకే పూవులకు బోధత్వం దొరికెనే
దు:ఖము నెరుగకె పూవులకు చిన్మయ మందెనే

మృత్యువు తెలియనిదా పువ్వులకు మరణము తెలియనిదా
దు:ఖము తెలియదులే పూవులకు కోర్కెల నెరుగవులే

బోధత్వం – "రాగ, ద్వేష, మోహములు శూన్యించిన మానసస్థితి"

## భిక్షువూ ...

బుద్దే కదలలేదు ఇంచెడు
దేహము కదలె పూర్ణమయి - భిక్షువూ

.
మునుగుతూ నదినదములు
తిరుగుతూ దేశదేశములు
ఆరుపదులు దాటిననూ...

బుద్దే కదలలేదు ఇంచెడు
దేహము కదలె పూర్ణమయి - భిక్షువూ

.
చదువుతూ జ్ఞానకోశములు
చేస్తూ పరమపదసోపానములు
ఆరున్నొక్క పదులు వచ్చిననూ...

విజ్ఞాని నైపోతినే కాని
జ్ఞానినై రాలక పోతిని - భిక్షువూ

ఏవీ ...

ఏమి పూపొదల్, ఏమి 'సమ' సారముల్ – ఏమి?
ఏవి దు:ఖముల్, ఏవి శోకముల్ – ఏవి భిక్షువూ

.
నేలన విగత దేహముల్ రెమ్మల చూలి బాలింతరాల్
కొమ్మల పూబాలికల్ తూగె చిన్మయానందములన్...

ఏమి పూపొదల్, ఏమి 'సమ' సారముల్ – ఏమి?
ఏవి దు:ఖముల్, ఏవి శోకముల్ – ఏవి భిక్షువూ

.
మట్టిన కుళ్ళిన దేహముల్ శాఖల మధుఫలములల్
లతాంతత బోసి హాసములల్ నూగె స్థితిప్రజ్ఞతలన్...

ఏమి పూపొదల్, ఏమి 'సమ' సారముల్ – ఏమి ?
ఏవి దు:ఖముల్, ఏవి శోకముల్ – ఏవి భిక్షువూ

అటు పుట్టుకల్ ఇటు మరణముల్
ఇటు శిశిరముల్ అటు జీవనేచ్ఛ అలల హేలల..

ఏమి పూపొదల్, ఏమి 'సమ' సారముల్ – ఏమి ?
ఏవి దు:ఖముల్, ఏవి శోకముల్ – ఏవి భిక్షువూ

1. జననము
2. మరణము
3. కైవల్యము
4. నిర్వాణము
5. ఉత్సవము

## వందే ...

జననము జనని
మరణము తండ్రి
జనన మరణములకు వందే...
జననీ జనకులకు

శక్తే జనని
లయం తండ్రి
శక్తి, శక్త సృష్టికి వందే..
పార్వతీపరమేశ్వరో

జననే ప్రకృతి
జనకే పురుషుడు
జననమరణ లయకు వందే..
పార్వతీపరమేశ్వరో

చివరిమాట ...

చలననిశ్చలనములు, శబ్దనిశ్శబ్దములు
జననమరణములు... ఒకటికి బహువచనము

పూచిన పూవులో వికసించేది
తీసిన ఊపిరిలో ఎదిగెదిగేది
మరణమె కాని జననము కాదుకదా
జననమరణములు..ఒకటికి బహువచనము

సాగిన నదిలో, పూసిన విశ్వములో
పరివ్యాపితమయ్యేది మరణమె కాద
జననము బిందువు, మరణమే వృద్ధీ
జననమరణములు...ఒకటికి పర్యాయమూ

ఏ పుట్టుక కాదూ ఒంటరి ప్రకృతిలో
ఏ మరణము రాదూ చిట్టచివరిలో
పుట్టినదీ పుట్టుకె కాదూ మరణము కూడ
జననమరణములు..లయ కుడిఎడమ అడుగులు

చలననిశ్చలనములు, శబ్దనిశ్శబ్దములు
జననమరణములు... ఒకటికి బహువచనము

పూలు ..

జననము కలిపినది ఈ ఇలను
మరణముతో వదిలెద వదిలెదనూ

తిరగని ఊరేది
వెళ్ళని ఇల్లేది
నాకేమయి ఊరు
నేనేమయి ఇంటికి
జననము కలిపినది ఈ నేలలు
మరణముతొ వీడెద వీడిపోయెద ...

కలవని మనిషేడి
చూడని మనసేది
నాకేమయి లోకం
నేనేమయి జగతికి
జననము కలిపినదీ మనుజులను
మరణముతొ వీడెద వీడిపోయెద ...

పూలకి తెలుసు...

తగునా భయమూ నను చూచీ
తగదని పూవులు పూయ క్షణక్షణమూ

.
పూసిన ప్రతి విరి నను చేరకపోతే
రాబోయె మొగ్గకు తావేదీ పూకొమ్మన
పూచినపూవూ రాలుటె నియమం
వాడిన దేహం మార్పుకె మరణం

తగునా భయమూ నను చూచీ
తగదని పూవులు పూయ క్షణక్షణమూ

.
పూయని పూవుకు కలదా మరణం
సాగని నదికేది త్రివేణీసంగమం
ఖడ్గము కానూ గాయము చేయను
జబ్బును కాదూ ద్రోహము చేయను

తగునా భయమూ నను చూచీ
తగదని పూవులు పూయ క్షణక్షణమూ

## ఇంతే ఇంతే...

పుష్పమా పుష్పమ... ఓ పుష్పమా
పుట్టుక క్షణముల వేడుక
మరణమె సహచరి జరపవే ఉత్సవం
పుష్పమ పుష్పమ ... ఓ పుష్పమా

ఉదయము ఉచ్ఛ్వాసము
సంధ్యలు నిశ్వాసము
పూస్తూ, రాలుతు – రాలుతు, పూస్తూ జరపవే ఉత్సవం
జీవన క్షణక్షణమున సహచరి మరణమే సదా
అంతె అంతె అంతా – అంతే అంతె

ఊపిరి తీస్తే ఉచ్ఛ్వాసము
ఊపిరి వదిలితె నిశ్వాసము
వస్తూ పోతూ – పోతూ వస్తూ జరపవే ఉత్సవం
జీవన క్షణక్షణమున సహచరి మరణమే సదా
ఇంతె ఇంతె అంతా – ఇంతే ఇంతె

## పరిప్రశ్ననై ...

మరణం నుంచి మరణం వరకూ
పుట్టుక నుంచి పుట్టుక వరకు
ఒక పరివ్రాజకనై పరిభ్రమించితి
.
ఎందుకు వస్తినో తెలియక
ఎందుకు ఈ బ్రతుకో ఎరుంగక
ఒక పరిప్రశ్ననై పరిభ్రమించితి..

ఈ జగతి మూలమేమిటని
కాల ఆది అంత రహస్యమేమని,
పుట్టుక నుంచి మరణం వరకు
మరణం నుంచి పుట్టుక వరకూ
ఒక పరివ్రాజకనై పరిభ్రమించితి

.
నేనెవరిననీ తెలియక
సూత్రమెవరనీ, మూలమేదని
ఒక పరిప్రశ్ననై పరిభ్రమించితి..

వదిలిన శ్వాసలు ఎక్కడికని
వచ్చే ఊపిరి మూలమెక్కడని,
పుట్టుక నుంచి మరణం వరకు
ఒక పరివ్రాజకనై పరిభ్రమించితి,
మరణం నుంచి పుట్టుక వరకూ
ఒక మార్మికత (mystic) నై పరిభ్రమించితి

## ఏమి జరిగినదీ ...

ఉదయము పుట్టితిని
సంధ్యకు రాలితిని
నడుమ ఏమి జరిగినది – ఈ
నడుమ ఏమి జరిగినది
.
ఖాళీ చేతులతో వచ్చితిని
ఒట్టి కాళ్ళతో వెళ్ళితినీ...
నడుమ ఏమి జరిగినది – ఈ
నడుమ ఏమి జరిగినది

ఏమి జరిగినదీ
రాకపోకల నడుమ
ఏమి జరిగినది

.
ఒంటరిగ ఏతెంచితిని
ఒంటరినయి నిష్క్రమించితినీ..
నడుమ ఏమి జరిగినది – ఈ
నడుమ ఏమి జరిగినదీ

ఏమి జరిగినదీ
రాక...పోక...లేక
ఏమి జరిగినదీ

శకలము ...

రెండు నిజముల నడుమ వంతెనేది – ఈ
రెండు నిజముల మధ్యనున్న శకలమేదీ

.
పూయుట కాదు భ్రమ
రాలుట కాదు మిథ్య
మిగతాది ఏమిటీ...
వెతికి పెట్టరే వాలె పొద్దూ నాకు...

రెండు నిజముల నడుమ ప్రశ్నేమీ – ఈ
రెండు నిజముల మధ్య వెలుగేది

.
నేను వచ్చాను కాదు భ్రమ
నేను పోయాను కాదు మిథ్య
ఈ రంగులమడు గేమిటీ...
వెతికి ఉంచరే నా మట్టిపై శకలము...

రెండు నిజముల నడుమ నిజమేదీ – ఈ
రెండు నిజముల మధ్య శేషమేది... ఆ విశేషమేదీ

అయ్యేదనొక ...

చూడల... నా పుట్టుక
చూడను... నా మరణము
చూడనూ...
పుట్టుక వెనుక,
మరణము ఆవల
.
ప్రతి జననము చూచెద
నా పుట్టుక తలచెద
అయ్యేద నొక ఉత్సవమూ,
నేనొక డోలోత్సవము

చూడల... నా పుట్టుక
చూడను ... నా మరణము
చూచెద ప్రతిదీ నడుమ
.
ప్రతి చావుకి వెళ్ళగ
నా మరణము నను కలువ
అయ్యేద విషాదమూ,
అయ్యేద నొక వైరాగ్యము

చూడల ... నా పుట్టుక
చూడను... నా మరణము
చూచెద ప్రతిదీ ప్రతిగ

ఊరకె ...

ఊరకె అలా అలరై
ఊరకె ఇలా ఇలపై
చక్రభ్రమణమే విరీ

.
ఊరకె అలా పుడుతు
ఊరకె ఇలా పోతూ
చక్రభ్రమణమే విరీ
పరిపరి పరిభ్రమణమే ఊరకె

ఊరకె అలా పూస్తు
ఊరకె ఇలా ఫలిస్తు
చక్రభ్రమణమే విరీ

.
ఊరకె అలా అల ల
ఊరకె ఇలా ఇల ల
చక్రభ్రమణమే విరీ
పరిపరి పరిభ్రమణమే ఊ ర కె

ఊరకె అలా పూస్తు
ఊరకె ఇలా ఫలిస్తు
చక్రభ్రమణమే విరీ

మట్టి ...

రాయే వేయని వేషములేవి
మట్టే కట్టని రూపములేవి
నాటకము ముగియగ బూడిదె కాదె
మట్టిని చేరిన మట్టే కాదె... విరీ

పూవులు మృదులము, విరీ – క్షణికము
ఖడ్గము కఠినము, విరీ – శాశ్వితము
మట్టినుంచి రానిది ఏది
మట్టిని చేరుకోనిది ఏది... విరీ

రాయే వేయని వేషంబులు ఏవి
మట్టే కట్టని రూపంబులు ఏవి
నాటకము ముగియగ బూడిదె కాదె
మట్టిని చేరిన మట్టే కాదె... విరీ విరీ

దైవం ...

దైవ భావన అమరం
దైవ రూపము నిత్య రూపాంతరం

.
ఆదిలో వెలుగే దైవము
ఆపై యోనే దైవము,
రాజే దైవము తదుపరి
తాత్వికుడె దైవము

దైవ భావన అమరం
దైవ స్వరూపము నిత్య రూపాంతరం

.
గుణమే దైవము ఆపై
రూపమే దైవము,
మార్మికతె దైవము ఆపై
భౌతిక నియమమె దైవము

దైవ భావన అమరం
దైవ రూపము నిత్య రూపాంతరం

## కాలం తిరుగును ...

కాలం తిరుగును
ఆటుకు పోటుకు, పోటుకు ఆటుకు వీరీ –
తిరగనిదేది ఉండదు
తిరిగేదేదీ ఆగదు వీరీ

నీరే తిరుగును
నింగికి నేలకు, నేలకు నింగికి వీరీ –
పూలే తిరుగును
కొమ్మకు మన్నుకు, మన్నుకు పూకొమ్మకు వీరీ

తిరగనిదేది ఉండదు
తిరిగేదేదీ ఆగదు వీరీ
కాలం తిరుగును
ధూళికి రోదసికి, రోదసికి ధూళికి వీరీ –
.
గింజే తిరుగును
చెట్టుకు మట్టికి, మట్టికి చెట్టుకు వీరీ –
జీవం తిరుగును
వొంటికి మట్టికి, మట్టికి వొంటికి వీరీ

తిరగనిదేది ఉండదు
తిరిగేదేదీ ఆగదు వీరీ
కాలం తిరుగును
కృష్ణకి కాంతికి, కాంతికి కృష్ణకు వీరీ
.
పోటు – బిగ్ బ్యాంగ్ తరువాతి వ్యాకోచం , ఆటు – బిగ్ బ్యాంగ్ ముందు సంకోచం

## నియమము ఒకటే ...

నియమము ఒకటే
మితులే వేరు
పరిభ్రమణమే ఉనికికి సూత్రము

.

కేంద్రకము చుట్టూ ఎలక్ట్రానులు
సూర్యుని చుట్టూ గ్రహములు
సౌరమండలము విశ్వకేంద్రము చుట్టూ
పరిభ్రమణమే ఉనికికి ఏకసూత్రము

.

జీవం తిరుగును వొంటికి, మట్టికి
విశ్వం తిరుగును కృష్ణబిలముకు, వెలుగుకు
ఉనికే తిరుగును మరణము, జననముకు
పరిభ్రమణమే ఉనికికి మూలసూత్రము

సృజన నియమం ...

మరణము తాత్కాలికము.. ప్రతిచర్య జననము
లయం శాశ్వితమూ ... ప్రతిచర్య నూతన సృజన

మొక్కే ఎండును తాత్కాలికం, గింజే సాగును
దేహం రాలును తాత్కాలికం, జీవం సాగును
మరణము తాత్కాలికం... ప్రతిచర్య జననమ్

నత్రజని తగ్గిన...శాశ్వతము, జురాసిక్ లయమూ
ఆక్సిజని తగ్గిన...శాశ్వతము, మానవ లయము
విశ్వము రాలిన... శాశ్వతము, సూర్యుని లయము
లయం శాశ్వతమూ... ప్రతిచర్య నూతన విశ్వము

Note :

అనేక విశ్వాలు
ఒక్కో విశ్వానిది ఒక్కో భౌతిక నియమావళి
నిరంతరం పుట్టే విశ్వాలు, నశించే విశ్వాలు
సృష్టి ఉచ్ఛ్వాశనిశ్వాసాలుగ ఉన్నాయి.

నిద్రాణం ...

మరణము ఒక నిద్రాణం
జననము ఒక చేతన
మరణ, జననముల నడుము
స్థల కాల ద్రవ్య స్థితి శూన్యము

గింజలో జీవము నిద్రాణం
పరమవేడి ($0^0$K) న చేతన నిద్రాణం
నిద్రాణ, చేతనల నడుము
స్థల కాల ద్రవ్య స్థితి శూన్యము...
జననము ఒక చేతన
మరణము ఒక నిద్రాణం

పీపాదశలో జీవం నిద్రాణం
కృష్ణబిలమున పదార్థము నిద్రాణం
మహావిస్పోట మరణ, జననముల నడుము
స్థల కాల ద్రవ్య స్థితి శూన్యము...
జననము ఒక చేతన
మరణము ఒక నిద్రాణం

## నా మాటలు...

ప్రతిదీ సాపేక్షకమైన ఈ క్షణమున, ఈ చోటన, ఈ నేనున
– నా మాటలు.
సృష్టిలో చివరి మాటలకు తావులేదు.
పరిణామములోని ఆ దశను ప్రతిఫలించే మాటలే ఉంటాయి.

మానవ సమూహాలలో
జననమే కాదు
మరణము కూడ ఉత్సవమే.

అది –
ఒకచోట పదిమంది చేరి జరిపే భౌతిక ఉత్సవం,
మరోచోట భగవంతుని చేరుకునే ఉత్సవం,
ఇంకోచోట జ్ఞానం అందుకున్న ఉత్సవం,
వేరేచోట పరిణామం పుష్పించిన ఉత్సవం.
మానవ సమూహములో
జననమే కాదు
మరణము కూడ నిత్య ఉత్సవం

సృష్టిన

జనన

మరణ

ఉత్సవములె – ఈ

“ఉత్సవమ్”